
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.2

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5


శుక్రవారం 2 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	538.80 (185.8360)	4,91,022	30,368
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.90 (3.78)	453.93	540.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.73 (1.11)	162	నిల్

చికెన్ ధరలు: లైవ్: రూ.135 డ్రెస్: రూ.210 స్కిన్‌లెస్: రూ.240

గంధమల్లా కుదింపు



తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామం

- ఇప్పటివరకూ రిజర్వాయర్ నిర్మాణంపై స్పష్టత కరువు
- మొదట 9.8 టీఎంసీలు... ఆ తర్వాత 4.28 టీఎంసీలుగా ప్రతిపాదనలు
- చివరగా 1.5 టీఎంసీలకే పరిమితం
- గ్రామాల ముంపు లేకుండా నిర్మాణానికి సన్నాహాలు

గంధమల్ల ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని కుదించారు. తొలుత 9.8 టీఎంసీలుగా నిర్ణయించి, చివరగా 1.5 టీఎంసీలకు తగ్గించారు. మొదట అనుకున్న ఆలోచన ప్రకారం రైతుల నుంచి ఎక్కువ ఎకరాలు సేకరించాల్సి రావడం, రెండు మూడు గ్రామాలు పూర్తిగా ముంపునకు గురికావాల్సి వస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ప్రాజెక్ట్ త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రాజెక్ట్ నిర్మాణ సామర్థ్యాన్ని తగ్గించినట్లు తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణ సామర్థ్యాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ముంపు గ్రామాలతోపాటు వేలాది ఎకరాలు భూసేకరణ లేకుండా ఈ రిజర్వాయర్‌ను నిర్మించేందుకు ఇరిగేషన్‌శాఖ తగిన చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో గంధమల్ల అంశంపై చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ రిజర్వాయర్ నిర్మాణంపై 2019 ఫిబ్రవరిలో ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ రిజర్వాయర్‌ను మొదటగా 9.8టీఎంసీలుగా నిర్మించేందుకు ప్రణాళికను సిద్ధంచేశారు. ఈ మేరకు 232 ఎకరాల అటవీ భూమిని సేకరించింది. నిర్మాణ పనులు ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించింది. ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీలకు 4,162 ఎకరాల భూమి అవసరం కాగా, రిజర్వాయర్ వల్ల 4,027 ఎకరాల భూమితోపాటు 1,568 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో గంధమల్ల, బచ్చులగూడెం, ఇందిరానగర్ గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతుండగా వీరారెడ్డిపల్లిలో దాదాపు 1,800 ఎకరాల వరకు భూములు కోల్పోయే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసితులు నిరసన వ్యక్తం చేయడంతో 4.28 టీఎంసీలకు తగ్గించారు. దీంతో వీరారెడ్డిపల్లిని ముంపు నుంచి తప్పించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి పనులు కూడా మొదలు పెట్టలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రతిపాదనల్లో గంధమల్ల ముంపు గ్రామంగానే ఉంది. తాజాగా ప్రభుత్వం 1.5 టీఎంసీల సామర్థ్యానికి తగ్గించడంతో ముంపు గ్రామాలు లేకుండా... భూసేకరణ వేయి ఎకరాలకు పరిమితం చేసింది. రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించడంతో త్వరలోనే పనులు చేపడుతారని ఈ ప్రాంత రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

9.8 టీఎంసీల నుంచి 1.5టీసీఎంలకు పరిమితం

సముద్రమట్టానికి అత్యంత ఎత్తైన ప్రాంతంగా, నదీజలాల సదుపాయంలేని కరువు నేల యాదాద్రి భువనగిరి జిల్లాకు గోదావరి జలాల మళ్లింపునకు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు 14, 15, 16 ప్యాకేజీల కింద పనులు ప్రారంభించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2.50లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే 14, 15వ ప్యాకేజీలో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల వద్ద రిజర్వాయర్ నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించింది. ఎత్తిపోతల లింక్ ప్రాజెక్టులో చివరి(టెయిల్‌ఎండ్)లో గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం పూర్తిస్థాయి సర్వేకు ఆదేశించడంతో రిజర్వాయర్ నిర్మాణంతో కోల్పోతున్న భూముల్లో ప్రాజెక్టుకు సంబంధించిన హద్దురాళ్లను కూడా ఏర్పాటు చేశారు. ఈ రిజర్వాయర్‌ను మొదటగా 9.8 టీఎంసీలుగా నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధంచేసింది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారా 2,450 క్యూసెక్కుల నీరు గంధమల్ల జలాశయానికి చేరేలా ప్రణాళికను రూపొందించారు. డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా 6,467 ఎకరాలు, ప్రధాన ఎడమకాల్వ(ఎల్‌ఎంసీ)ద్వారా 37,814ఎకరాలు, కుడికాల్వ(ఆర్‌ఎంసీ) ద్రావా 19,901 ఎకరాలు సాగునీరు అందించేందుకు అంచనాలు రూపొందించారు. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 1.5టీఎంసీలకు తగ్గించింది.


గత ప్రతిపాదనలకే సై

ఈ రిజర్వాయర్‌ను ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాలో 63వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లాలోనే 62,429 ఎకరాల ఆయకట్టు ఉంది. గజ్వేల్ మండలం కొడకండ్ల నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని తుర్కపల్లి వరకు కాల్వ, రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కింద పనులు ప్రారంభించారు. రీ డిజైన్‌లో గంధమల్ల రిజర్వాయర్ 9.86 టీఎంసీలకు సామర్థ్యంతో చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం 4.28 టీఎంసీలు, తాజాగా 1.5 టీఎంసీలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజపేట, ఆలేరు, బీబీనగర్, యాదగిరిగుట్ట, ఆత్మకూరు(ఎం) మండలాలకు సాగునీరు అందనుంది.

మూడు సెక్టార్లుగా భువనగిరి

- మెరుగైన శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం
- ప్రతీ సెక్టార్‌కు ఒక ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది

భువనగిరి టౌన్, ఆగస్టు 1: మెరుగైన శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా కేంద్రం భువనగిరి పట్టణాన్ని మూడు సెక్టార్లుగా విభజించారు. త్వరలోనే నాలుగో సెక్టార్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. పెరుగుతున్న చోరీలు, రోడ్డు ప్రమాదాలు, క్రిమినల్ చర్యలపై ప్రత్యేక దృష్టి పెడుతూ స్థానికుల సహకారంతో దోషులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేసే లక్ష్యంతో సెక్టార్లుగా విభజించినట్లు పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ప్రతీ దుకాణం ఎదుట తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా, దాతల సహకారంతో రహదారుల వెంట సీసీ కెమెరాలను బిగించేందుకు కూడా అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే బిగించి ఉన్న, పనిచేయని కెమెరాలకు మరమ్మతులు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. పలు చోరీ ఉదంతాలతోపాటు క్రిమినల్ కేసులను ఛేదించడంలో కీలకమవుతున్న సీసీ కెమెరాలను పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసేలా ప్రజలను చైతన్యపర్చనున్నారు. అయితే తమ ప్రాంతాల్లో నెలకొనే అనుమానాస్పద ఘటనలు, అనుమానాస్పద వ్యక్తులు, ప్రమాద, చోరీ ఘటనలను వెంటనే సంబంధిత సెక్టార్ ఎస్‌ఐలకు సమాచారం ఇవ్వాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌కుమార్ సూచిస్తున్నారు. ప్రతీ సెక్టార్‌కు ఒక ఎస్‌ఐ, ఇతర పోలీస్ సిబ్బందిని కేటాయించారు. సంబంధిత అధికారులు, పోలీసులు ఆయా సెక్టార్ల ప్రజలతో సత్సంబంధాలు నెరపడంతో నిరంతరం నిఘా పెడతారని తెలిపారు. సెక్టార్లలో పేర్కొన్న ప్రాంతాల్లోని సమీప బస్తీలు, కాలనీలు, ప్రాంతాలన్నీ కూడా ఆయా సెక్టార్ల పరిధిలోకి వస్తాయని పోలీసు అధికారులు అంటున్నారు. అయితే క్లూస్ టీం, సీసీఎస్, ఐడీపార్టీ సహా మిగతా విభాగాలన్నీ పట్టణమంతటా పనిచేస్తాయి.



మూడు సెక్టార్లు ఇవే..

సెక్టార్-1 : ఎస్‌ఐ బి.కుమారస్వామి, సెల్:8712662490, ప్రాంతాలు.. రైలు పట్టాల వెనుక ప్రాంతాలన్నీ, గంజ్ మార్కెట్ ఏరియా, ఠాగూర్ రోడ్డు, శృతినగర్, సంతోష్‌నగర్, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కళాశాల, ఓల్డ్ వివేరా, సంజీవనగర్, హనుమాన్‌వాడ, పాత బస్టాండ్, ఆర్‌బీనగర్, జాతీయ రహదారిపై న్యూ వివేరా హోటల్ నుంచి లేబే వరకు, కొత్త బస్టాండ్ శివానగర్, భువనగిరి ఖిల్లా పరిసరాల్లోని వెంచర్లు,

సెక్టార్-2: ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, సెల్:8712662488, ప్రాంతాలు.. ఆజాద్‌రోడ్డు, కుమ్మరివాడ, గాంధీనగర్, ఖిల్లానగర్, సమ్మద్ చౌరస్తా ఆజాద్‌రోడ్డు, జలీల్‌పుర, మీనానగర్, రెడ్డివాడ, బ్రాహ్మణవాడ, బోయవాడ, కామునికుంత, దోబివాడ, ఇందిరానగర్, పోచమ్మవాడ, జంఖాన గూడ చౌరస్తా, ఖాజీమహల్లా, రాంనగర్, సీతానగర్, నల్లగొండ రోడ్డు, ఎల్బీనగర్, సింగన్నగూడెం, హౌసింగ్ బోర్డు కాలనీ, బైపాస్ రోడ్డుపై లేబే నుంచి డాల్ఫిన్ హోటల్ వరకు టీచర్స్ కాలనీ, తుక్కాపురం రోడ్డు.

సెక్టార్ -3: ఎస్‌ఐ డి.మల్లయ్య, సెల్:8712662491, ప్రాంతాలు.. కిసాన్ నగర్, కోర్టు ఏరియా, విద్యానగర్, బంజారాహిల్స్, పహాడినగర్, తారకరామానగర్, ప్రగతినగర్, తాతానగర్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఏరియా, పెద్ద చెరువు, డాల్ఫిన్ హోటల్, పారిశ్రామిక వాడ, శబరినగర్, క్రిస్టల్ వెంచర్, కార్ హెడ్ క్వార్టర్స్ వైల్డ్ స్టోన్ వెంచర్, ఫైర్ స్టేషన్, ఆండాళ్ నగర్, రేణుక ఎల్లమ్మ ఆలయ పరిసరాలు, స్పిన్నింగ్ మిల్, జైన్ మందిర్, బొమ్మాయిపల్లి రోడ్డు.

సంబరం



భువనగిరిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చుతున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకమైందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలోని పలు చోట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేయడంతోపాటు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకంచేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మాదిగ ఉపకులాల అభివృద్ధి కోసం చేపట్టిన వర్గీకరణపై సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుతో సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందన్నారు.

•8లో..

ఆగ్రహం



భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మహిళలను కించపరిచేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా నిరసన తెలిపారు. జిల్లాకేంద్రంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. దిష్టిబొమ్మను పోలీసులు లాక్కోవడం.. బీఆర్ఎస్ నేతలు తిరిగి లాక్కోవడం.. ఇరువర్గాల పరుగులు, తోపులాటల అనంతరం దహనం చేశారు.

•8లో..

నిరసన




యాదగిరిగుట్టలో రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట దేవస్థాన సిబ్బందిని బదిలీ చేయొద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అనడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలని జూలై 30న అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం గుట్టలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు.

•7లో..

సన్నాల సాగుపైనే రైతుల ఆసక్తి

- రూ.500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- దీంతో రైతుల్లో ఆసక్తి
- ఈ వానాకాలంలో 33 రకాలను సన్నాలుగా గుర్తించిన ప్రభుత్వం



భువనగిరి రూరల్, ఆగస్టు 1: ప్రస్తుత వానకాలం సీజన్‌లో 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయి కమిటీ ప్రతిపాదించిన రకాలనే నోటిఫై చేసినట్లు అందులో పేర్కొన్నారు. ఈ సీజన్ నుంచే సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం పేర్కొన్న సన్నాలకే బోనస్ వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వం బీపీటీ-5204 రకం, ఆర్‌అండ్ ఆర్ 5048, హెచ్‌ఎంటీ సోనా, జైశ్రీరాం రకాలను ప్రామాణికంగా పేర్కొంటూ ఆయా రకాలను సన్నాలుగా గుర్తించినట్లు ఉత్తర్వులో పేర్కొంది. గింజ పొడవు 6 మిల్లీ మీటర్ కన్న తక్కువ వెడల్పు, రెండు మిల్లీ మీటర్లు మించకుండా ఉంటే సన్నాలుగా గుర్తించాలని ప్రభుత్వం పేర్కొంది. నాణ్యత పరీక్ష కోసం పొట్టు తీసిన గింజలను 15శాతం తేమ కన్న తక్కువ ఉన్నప్పుడే నిర్ధారించాలని, పొడవు, వెడల్పుకు డయో మైక్రో మీటర్ పరికరం వినియోగించాలని పేర్కొంది.

ఎకరాకు రూ.64,860

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో వానాకాలం ప్రతీ సీజన్‌లో 13.50 లక్షల ఎకరాలకు పైగానే వరి సాగవుతోంది. ప్రస్తుత సీజన్‌లో 12.40లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈసారి సన్నాల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. 50శాతానికి పైగా రైతులు సన్నరకాల విత్తనాలనే కొనుగోలు చేసినట్లు జిల్లా విత్తన డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు పొద్దటూరు ప్రశాంత్ తెలిపారు. ఇప్పటికే వరి నారు పోసిన రైతులు ఇటీవలి వర్షాలతో నాట్లు ముమ్మరంచేశారు. ఇందులో అత్యధికంగా సన్నాలే ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దొడ్డు రకం వరి సాగుకు ఎకరాకు రూ.22వేలు పెట్టుబడి కాగా, 28క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. అదే సన్నాలకు రూ.30వేలకు పెట్టుబడికి 23 క్వింటాళ్ల దిగుబడి ఉత్పత్తి అవుతుంది. ఎకరాకు రూ.11,500 చొప్పున బోనస్‌తో పాటు ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.2,320 చొప్పున రూ.53,360 కలిపి రూ.64,860వరకు రైతులకు రాబడి లభిస్తుంది. దీంతో ఈ సారి సన్నాల సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వం ఈ కింద రకాలను సన్నాల ధాన్యం కింద ఎంపిక చేసినట్లు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ వెల్లడించారు.

ప్రభుత్వం గుర్తించిన 33 సన్న రకాలు ఇవే..

డబ్ల్యూజీఎల్-14, 44, 347, 962, 1119, 32100
కేపీఎస్-2874,
బీపీటీ- 5204,
జేజీఎల్-384, 1798, 27356, 28545, 11470, 3228, 3844, 3855, 11118, 17004, 33124,
ఆర్‌అండ్‌ఆర్-1504,
కేఎన్‌ఎం- 733, 1638,
ఆర్‌ఎన్‌ఆర్ -21278,
ఎన్‌ఎల్‌ఆర్-34449,
ఆర్‌ఎన్‌ఆర్ - 2458, 2465, 2354, 31479,
కేపీఎస్ -6251,
హెచ్‌ఎంటీ సోనా, ఎంటీయూ-1224,1264, 1271

ఆధునిక పద్ధతుల్లో శిక్షణ

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



ఆలేరులోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

ఆలేరు రూరల్, ఆగస్టు 1: విద్యార్థులకు నేటి ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో ఉపాధి శిక్షణ అందించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. గురువారం ఆయన ఆలేరులోని ప్రభుత్వ ఐటీఐని, మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐటీఐ శిక్షణ సంస్థలో కోపా, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, ఫిట్టర్, మెకానిక్, టర్నర్ తదితర ట్రేడ్‌లు అందిస్తున్న శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో విద్యార్థుల సిబ్బంది హాజరు రిజిస్టర్లను, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో పలు పాఠ్య పుస్తకాలను చదివించారు. వర్షాకాలంలో విద్యార్థులకు డెంగీ, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయనవెంట ఐటీఐ, మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్‌లు హరికృష్ణ, జి.లలిత, సయ్యదా ముస్కినా, అంజుమ్ తదితరులు ఉన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 1: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం శోభారాణి తనిఖీచేసి అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని పరిశీలించారు. భూదాన్‌పోచంపల్లి కేజీబీవీలోని విద్యార్థుల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు, వరద నీరు నిల్వ ఉండటంతోపాటు, బోరు మునిగిపోయి ఉండటం, కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంపీడీవో రాపర్తి భాస్కర్ ఇటీవల కలెక్టర్ హనుంతు కే.జెండగే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ స్పందించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు రూ.10లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో జలాల్‌పూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో భాగంగా చేపట్టిన భోజనాల గది, డార్మిటరీలు, వాష్ ఏరియాలో కల్పించిన సౌకర్యాల గురించి జడ్పీ సీఈవో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆవరణలోని పారిశుధ్యాన్ని పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన వన మహోత్సవంలో పాల్గొన్న జడ్పీ సీఈవో శోభారాణి మొక్కనాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాపర్తి భాస్కర్, సూపరింటెండెంట్ సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశం, ఈజీఎస్ ఏపీవో కృష్ణమూర్తి, సిబ్బంది అపర్ణ, కృష్ణ పాల్గొన్నారు.

గల్లీల్లో గస్తీ

సైడ్.. సైడ్.. సైడ్ ప్లీజ్.. వుయ్ ఆర్ ద లోకల్ పోలీస్

సంస్థాన్‌నారాయణపురం, ఆగస్టు 1: గ్రామాల్లో గస్తీ తిరిగేందుకు పోలీసులు సైకిల్ వినియోగించాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. అందులో భాగంగా పోలీస్ స్టేషన్లకు అవసరమైన సైకిళ్లను అందజేసింది. దీంతో స్టేషన్లకు చేరిన సైకిళ్లపై పోలీసులు గల్లీల్లో గస్తీ తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. కొంతకాలంగా కార్లు, ద్విచక్రవాహనాలపై గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించిన పోలీసులు తాజాగా సైకిళ్లపై తిరుగుతుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



సంస్థాన్‌నారాయణపురంలో సైకిల్‌పై గస్తీకి బయలుదేరిన పోలీసులు

‘స్వచ్ఛదనం-పచ్చదనం’ విజయవంతం చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

భువనగిరి అర్బన్, ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘స్వచ్ఛదనం-పచ్చదనం’ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం ఆమె మాట్లాడారు. పచ్చదనం పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో కార్యక్రమాన్ని ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 5న అన్ని గ్రామాలు, ప్రతీ పట్టణ వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించాలని, 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, 7న మురుగుకాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం, 8న సీజనల్ వ్యాధుల నియంత్రణ, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 9న డ్రైడే సందర్భంగా ప్రభుత్వ సంస్థలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో, మునిసిపల్ వార్డుస్థాయిలో ప్రత్యేక బృందాలను కలెక్టర్లు నియమించాలన్నారు. ప్రతీ గ్రామానికి, మునిసిపల్ వార్డులకు ప్రత్యేక అధికారులను నియమించడంతోపాటు గ్రామస్థాయి బృందంలో పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారి, ఆశావర్కర్లు, ఇతర గ్రామస్థాయి సిబ్బంది, వార్డు బృందంలో స్థానిక కౌన్సిలర్, కార్పొరేటర్, ప్రత్యేక అధికారి, రిసోర్స్ పర్సన్లు అధ్యక్షులుగా ఉంటారని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం తీర్చిదిద్దాలని, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతు కే.జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్, జడ్పీ సీఈవో శోభరాణి, డీఆర్డీవో కృష్ణన్, అటవీశాఖ అధికారి పద్మజారాణీ, డీపీవో ఆర్.సునంద పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ

● 15మంది ప్రయాణికులకు గాయాలు

గరిడేపల్లి, ఆగస్టు 1: ట్రావెల్స్ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొని 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం పట్టణానికి చెందిన జైశ్రీరాం టూర్ అండ్ ట్రావెల్స్ బస్సులో విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ జిల్లాలకు చెందిన 21 మంది సాయి భక్తులు మినీబస్సులో గత నెల 24వ తేదీన షిర్డీ వెళ్లి, తిరుగు ప్రయాణంలో పలు సాయి దేవాలయాలు దర్శించున్నారు. తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం సాయంత్రం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామ శివారులో గల సాయిబాబా ఆలయాన్ని సందర్శించుకున్నారు. అక్కడి నుంచి హుజూర్‌నగర్ వైపువెళ్తుండగా గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామశివారులోని కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై గల పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా హుజూర్‌నగర్ వైపు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ మార్గంలోకి ట్రావెల్ బస్సు వెళ్లి లారీని ఢీకొంది. వైజాగ్‌కు చెందిన బస్సు డ్రైవర్ జోగారావు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికుల సహాయంతో అతనిని బయటికి తీశారు. అసిస్టెంట్ డ్రైవర్ హరికుమార్ కాలికి గాయమైంది. మరో ప్రయాణికుడి తలకు గాయాలయ్యాయి. వీరితో పాటు మరో 13మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ సల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కీతవారిగూడెం వద్ద ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు, లారీ

కృష్ణానదిలో ఈత కొడుతూ వ్యక్తి గల్లంతు


యాదయ్య(ఫైల్)

చిట్యాల, ఆగస్టు 1: దైవదర్శనం నిమిత్తం శ్రీశైలం వెళ్లిన నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన వ్యక్తి కృష్ణానదిలో ఈత కొడుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. చిట్యాల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య(65) హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య ఎల్లమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు మల్లికార్జునస్వామిని దర్శించుకుందామని గురువా రం తెల్లవారుజామున 10మంది సహచర హమాలీలతో ఓ వాహనంలో అక్కడికి బయలుదేరారు. ఎనిమిది గంటలకు శ్రీశైలంలోని దోమలపెంట చేరుకుని స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి దిగారు. ఈత కొడుతుండగా ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో యాదయ్య కొట్టుకుపోయాడు. అక్కడేఉన్న సహచరులు పోలీసులకు సమాచారం ఇవ్వగా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి..
ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు– ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని ఆష్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త
మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!


» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.





కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై
మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రెటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.







సబ్‌రిజిస్ట్రార్ల బదిలీలపై దుమారం

● నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు ● జీరో సర్వీస్, స్పౌజ్ అమలులో ఆగమాగం ● మంత్రులకు ఫిర్యాదుల వెల్లువ

నల్లగొండ, ఆగస్టు 1: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం రాత్రి జరిగిన సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీలపై దుమారం చెలరేగుతోంది. బదిలీలపై నిషేధం విధించడానికి ముందు అన్యూహంగా జరిగిన ఈ బదిలీలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏకకాలంలో రాష్ట్రంలోని మిగితా జిల్లాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో బదిలీలు జరిగాయి. సబ్ రిజిస్ట్రార్‌లతో పాటు చిట్స్ డిపార్ట్‌మెంట్ ఇతర విభాగాల అధికారులను కూడా బదిలీ చేశారు. బదిలీల విషయంలో గడువు పెంచడానికి ముందు సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీకి సంబంధించి ఒక జాబితా తయారు చేసి ఉత్తర్వులు ఇచ్చే ముందే గడువు పెంచడంతో మరో జాబితాను తయారు చేయడంతో పాటు మొదటి జాబితాను తారుమారు చేసి రెండో జాబితాకు ఆమోదముద్ర వేసినట్లు చర్చనడుస్తోంది. కావాలనే రాష్ట్రస్థాయిలో ఓ వ్యక్తి చక్రం తిప్పి బదిలీలను అస్తవ్యస్తం చేశాడని ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిబంధనలు ఉల్లఘించారని ఆరోపిస్తూ కొందరు అధికారులు ఇప్పటికే మంత్రులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ సమీపంలోని ఓ జిల్లాకు చెందిన అధికారి బదిలీల్లో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

జీవోల ప్రకారం బదిలీలు జరిగినట్టేనా?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు విభిన్నమైన నిబంధనలు జీవోలు ఉన్నాయి. రెండేళ్ల సర్వీస్ పూర్తికాని వారిని బదిలీ చేయవద్దని జీవో 80పేర్కొంటుండగా, జీరో సర్వీస్ ద్వారా సర్వీస్‌తో సంబంధం లేకుండా ఒక రోజు చేశాడా రెండు రోజులు పనిచేశాడా, నెల, రెండు నెలలా అనే తేడా లేకుండా జీరో సర్వీస్ అందరికీ స్థాన చలనం కల్పించాలి. కానీ నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ డివిజన్‌లో ఉన్న ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఎస్ఆర్‌ను మాత్రం ఎందుకు బదిలీ చేయలేదని పలువురు అధికారులు ప్రశ్నిస్తున్నారు. తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్ ఇచ్చారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్పౌజ్ విషయంలో ముగ్గురు నుంచి నలుగురు సబ్ రిజిస్ట్రార్‌లకు కూడా బదిలీల విషయంలో అన్యాయం జరిగిందని సమాచారం. జీవోలను పక్కన పెట్టి రాత్రికి రాత్రే బదిలీలు చేయడం ఎందుకు అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఆ నాలుగు కార్యాలయాల్లో ఖాళీలు ఎందుకో?

నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎస్ఆర్ పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఖాళీగా ఉంచడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టారు. ప్రస్తుతం బదిలీలపై నిషేధం ఉన్నందున కీలకమైన, అధికంగా డ్యాకుమెంట్లు నమోదయ్యే భువనగిరి, సూర్యాపేటలో ఇన్‌చార్జిలతో నడిపించాల్సి ఉంటుంది. రామన్నపేట, నకిరేకల్ కార్యాలయాలకు కూడా ఇన్‌చార్జి అధికారులను డిప్యూటేషన్‌లపై కేటాయించాల్సి ఉంటుంది. మిగతా ప్రాం తాల్లో బదిలీచేసి ఈ నాలుగు కార్యాలయాలను ఎందుకు పక్కన పెట్టారనే దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుకూలమైన వ్యక్తులకు అధిక ఆదాయం వచ్చే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కేటాయించి ఉపయోగపడని వారిని ప్రాధాన్యంలేని కార్యాలయాలకు కేటాయించారని వాపోతున్నారు.

జీరో సర్వీస్ ప్రకారమే బదిలీలు

జీరో సర్వీస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం బదిలీలు చేసింది. అవసరమైనచోట జీరో సర్వీస్ ద్వారా బదిలీలు చేశారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి అయింది. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, జీవోల ప్రకారం బదిలీలు జరిగాయి.

● రవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ (ఎఫ్ఏసీ)

బదిలీ చేయొద్దనడం విడ్డూరం

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అధికారులను బదిలీ చేయొద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అనడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలపై జూలై 30వ తేదీన ప్రభుత్వ విప్‌బీర్ల అయిలయ్య అసెంబ్లీలో మాట్లాడినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గుట్టలో గురువారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. గతంలో ఎమ్మెల్యే ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా ఉన్నప్పుడు దేవస్థానంలో అవినీతి అధికారులను బదిలీ చేయాలని ఆనేక ఆందోళనలు చేసిన అయిలయ్య ప్రస్తుతం బదిలీలు ఆరు నెలల పాటు వాయిదా వేయాలని అసెంబ్లీలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను అడగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆలయ ఉద్యోగులు స్థానికంగా ఉండకుండా ఎక్కువ మంది హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, వారికోసం విప్ మాట్లాడం సమంజసంగా లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు జరుగుతుంటే కేవలం యాదగిరిగుట్ట ఉద్యోగుల బదిలీలు ఎందుకు జరగవద్దని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రచ్చ శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, ఉట్కూరి అశోక్‌గౌడ్, గుంటిపల్లి సత్యం, అజీమీర కిషన్‌నాయక్, ఆకుల చంద్రమౌళి ఉన్నారు.

నల్లగొండ జిల్లా ఏసీగా సులోచన బాధ్యతల స్వీకరణ

నల్లగొండ కల్చరల్, భువనగిరి అర్బన్: నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా అన్నెపర్తి సులోచన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీగా పనిచేసిన మహేంద్రకుమార్ జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. అదేవిధంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా విధులు నిర్వహించిన వజ్జల లక్ష్మణాచార్యులు ఉప ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందారు.

బదిలీలపై వివరణ కోరిన కమిషనర్

భువనగిరి అర్బన్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బదిలీల ప్రక్రియ ఊపందుకుంది. ఈ విద్యాసంవత్సరం గడిచినందున బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని శాసనసభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరడంతో రాజకీయ దుమారం రేగింది. ఉద్యోగుల పైరవీల్లో భాగంగానే ఈనెల 5వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు తెలిసింది. బదిలీల ఆప్షన్ ఫారం సమర్పించిన 25మంది ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సమాచారం ఇవ్వాలని దేవాదాయ శాఖ కమిషనర్ కోరారు. ఈనెల 2వ తేదీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి రావాలని పిలుపు వచ్చినట్లు సమాచారం.

దోపిడీరహిత సమాజంకోసం ఉద్యమాలు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 1: దోపిడీరహిత సమాజంకోసం ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఐ మండల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నేటికి పెట్టుబడిదారు, కార్పొరేట్ దోపిడీ వ్యవస్థను కేంద్రప్రభుత్వం పెంచి పోషిస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రధానమైన నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం సీపీఐ మండల నూతన కార్యదర్శిగా మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శిగా బత్తిని నరేష్‌తోపాటు 12మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, కుసుమని హరిశ్చంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పెరబోయిన మహేందర్, జల్ది రాములు, జక్క దయాకర్‌రెడ్డి, యాస బుచ్చిరెడ్డి, ఎస్.లింగారెడ్డి, ఎండీ నయీమ్, ఎం.అంజయ్య, ఎస్.రామచంద్రు, ఎం.స్వామి పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక తీజ్ వేడుకలు

బీబీనగర్, ఆగస్టు 1: గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక తీజ్ వేడుక అని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి సతీమణి కుంభం కిరణ్‌జ్యోతిరెడ్డి కొనియాడారు. బీబీనగర్ మండలం మీదితండాలో గురువారం జరిగిన తీజ్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పొట్టోళ్ల శ్యాంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణ గౌడ్, నాయకులు వాసుదేవరెడ్డి, రాజేందర్ నాయక్, సతీష్ నాయక్ పాల్గొన్నారు.

సబ్ కోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 1: చౌటుప్పల్ పట్టణంలో సబ్ కోర్టు ఏర్పాటు ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. వివాదాస్పదంగా మారిన జీవో నెం.50ని రద్దు చేసి చౌటుప్పల్‌లో సబ్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, బండారు నర్సింహ, సుర్వి నర్సింహ్మా, బడుగు లక్ష్మయ్య, సుంకరి జంగయ్య, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, జి.వెంకటేశ్, ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు తడక మోహన్, ముత్యాల భూపాల్ రెడ్డి, జి సురేందర్ రెడ్డి, బూరుగు కృష్ణా రెడ్డి పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా, చౌటుప్పల్ పట్టణంలో సబ్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు కోర్టు ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సంస్థాన్ నారాయణపురం, ఆగస్టు 1: తమ సమస్యలు సమస్యలను పరిష్కరించాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. మండలంలోని పుట్టపాక గ్రామంలో గురువారం చేనేత సహకార సంఘం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం కొనసాగించిన త్రిఫ్ట్ స్కీమ్, చేనేత బీమా, చేనేత మిత్ర లాంటి పథకాలను యథావిధిగా కొనసాగించాలని, నూలును సబ్సిడీపై అందించాలని, చేనేత రుణాలు మాఫీచేయాలన్నారు. చేనేత సహకార సంఘాలనుంచి ప్రభుత్వం వస్త్రాలను కొనుగోలు చేయకపోవడంతో లక్షలాది వస్త్ర నిల్వలు పేరుకుపోయాయన్నారు. సొసైటీలో నిల్వ ఉన్న సరుకును ఖరీదు చేయకుండా చేనేతరంగాన్ని గుర్తించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నేసిన వస్త్రాలు కొనుగోలులేక, చేతినిండా కార్మికులకు పనిలేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలన్నారు.

నిందితుడిని అరెస్ట్ చేయాలి

అడ్డగూడూరు, ఆగస్టు 1: ఇటీవల మండలంలోని కోటమర్తి గ్రామానికి చెందిన మందుల వంశీ(23) అలియాస్ (ఎల్లేష్) జేసీపీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్న వంశీ ఆత్యహత్యకు కారణమైన నిందితుడిని వెంటనే అరెస్టు చేయలని గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్.ఐ నాగరాజు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మృతుడి తల్లిదండ్రులు మందుల యాదగిరి, పార్వతమ్మ, సాయి ఉన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు

తుర్కపల్లి, ఆగస్టు 1: తుర్కపల్లి మండల వాసాలమర్రి గ్రామంలో కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతిని ఇవ్వవద్దని గురువారం గ్రామస్థులు తహసీల్దార్ దేశ్యానాయక్‌ను కోరారు. గ్రామ పరిధిలోని భైర బండ క్వారీ సమీపంలో ఉన్న భూమిలో కెమికల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిందని, ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే వాసాలమర్రి, రామశెట్టి పల్లి గ్రామాల్లోని చెరువులు కలుషితమయ్యే ప్రమాదముందని, అంతేకాకుండా వాతావరణ కాలుష్యం ఏర్పడి ప్రజలు, పశు, పక్ష్యాదులు అనారోగ్యం పాలయ్యే ప్రమాదముందని వినతిపత్రంలో పేర్కొన్నారు. దొమ్మాట బాబు, చుక్క రామనర్సయ్య, లక్కాకుల నర్సింహులు, కృష్ణ, సింగం రవీందర్, కొండ చంద్రం, పలుగుల అంజనేయులు, బొల్లారం రవి, పలుగుల రజినీకుమార్, పలుగుల జనార్ధన్, ఆకుల శ్రీనివాస్, పోగుల నర్సింహులు, దుబ్బాక వెంకటేశ్, శ్రీకాంత్, చిన్నూరి అజిత్, దొమ్మాట రాజు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రాగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 11,41,193 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారి మొక్కులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన రామిరెడ్డి దంపతులు దివ్య విమాన గోపురానికి 500గ్రాముల బంగారం విరాళంగా ఈవో ఏ.భాస్కర్‌రావుకు అందజేశారు. అనంతరం స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

మార్కండేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 1: పద్మశాలి ఆరాధ్య దైవం మార్కండేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి నూతన పాలక మండలి సభ్యులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర చేనేత నాయకులు తడక వెంకటేష్ అన్నారు. గురువారం ఆలయం నూతన కమిటీ పదవీబాధ్యతలు స్వీకరిస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని తడక వెంకటేష్ అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో దేవాలయం నూతన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత అంజనేయులు, ప్రధాన కార్యదర్శి అంకం యాదగిరి, కోశాధికారి ఇంజమూరి యాదగిరి పాల్గొన్నారు.



పాలకమండలిని సన్మానిస్తున్న సభ్యులు

సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పాలి

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యల చేశారంటూ గురువారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాయి. పలు చోట్ల సీఎం దిష్టిబొమ్మలను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పలుచోట్ల బీఆర్ఎస్ కార్యకర్తలు రాస్తారోకోలు నిర్వహించారు.

● *జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు*

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: అసెంబ్లీలో ఇద్దరు మాజీ మహిళా మంత్రులనుద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వాఖ్యలు తెలంగాణా ఆడపడుచులందరిని అవమానించినట్టులా ఉన్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి అన్నారు. సీఎం వాఖ్యలను ఖండిస్తూ గురువారం భువనగిరిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలిపిన నిరసనలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా సీఎం, డిప్యూటీ సీఎం తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే



భువనగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహిళలకు భద్రత, గౌరవం లభించేవని కాని నేటి పాలనలో కనుమరుగయ్యాయన్నారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవడంతో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. దిష్టిబొమ్మను పోలీసులు లాక్కోవడం...... బీఆర్ఎస్ కార్యకర్తలు తిరిగి లాక్కోవడం, ఇరువర్గాల పరుగులు, తోపులాటల అనంతరం దహనం చేసిన దిష్టిబొమ్మను పోలీసులు ఆర్పి వేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్ష కార్యదర్శులు ఏవీ కిరణ్ కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నీల ఓంప్రకాశ్, మాజీ చైర్మెన్లు జడల అమరేందర్ గౌడ్, కొల్పుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, ఇట్టబోయిన గోపాల్, కేశవపట్నం రమేశ్, నువ్వుల సుధాకర్, సిరిపంగ సుభాస్, పద్మ, అంజద్ పాల్గొన్నారు.



అడ్డగూడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● సీఎం రేవంత్‌రెడ్డి రౌడీగా వ్యవహరిస్తూ రౌడీ రాజ్యంగా మారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపించారు. గురువారం ఆలేరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. రేవంత్‌రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలేరు మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షులు పుట్ట మల్లేష్, నాయకులు జెల్లి నర్సింహులు, కొలుపుల హరినాథ్ పాల్గొన్నారు.

● మోత్కూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, నాయకులు మల్లం అనిత, కట్ట ఇంద్రజ్యోతి, మాజీ వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, గజ్జి మల్లేష్, మెట్టు జానమ్మ

● మోటకొండూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, నాయకులు బీస కృష్ణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, జీవిలికపల్లి వెంకటేష్, పన్నాల అంజిరెడ్డి, ఎండీ బురాన్, బొట్ల నర్సింహ పాల్గొన్నారు.



మోటకొండూరులో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● అడ్డగూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్‌నాథ్, నాయకులు పొన్నాల వెంకటేశ్వర్లు, చౌగోని సత్యంగౌడ్, పాశం విష్ణువర్ధన్, పూలపల్లి జనార్ధన్‌రెడ్డి, నాగులపల్లి దేవగిరి, పరమేష్ ఉన్నారు.



ఆలేరులో రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సునీత

● భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కోట మల్లారెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, చిట్టిపోలు శ్రీనివాస్, నోముల మాధవరెడ్డి, గునిగంటి మల్లేష్‌గౌడ్, అంకం యాదగిరి, బాలచంద్రంగౌడ్, జంగయ్యయాదవ్, యాదగిరి పాల్గొన్నారు.



పోచంపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● గుండాల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎండి.కలీల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గడ్డమీది పాండరి, మాజీ వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, దయాకర్, సాయి, రాములు, భిక్షం ఉన్నారు.

● రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు సట్టు తిరుమలేష్, చామకూర గోపాల్, సందెల భాస్కర్ గౌడ్, బెడిద వీరేశం, జశ్వంత్, నరేందర్, సుదర్శన్ పాల్గొన్నారు.

● వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎండీ.అఫ్రోజ్, నాయకులు పడమటి మమత నరేందర్‌రెడ్డి, డేగల పాండు, కొండూరు వెంకటేశం, సత్యనారాయణ పాల్గొన్నారు.

కృష్ణమూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు కాచం కృష్ణమూర్తి ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. కృష్ణమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని గురువారం భువనగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, కొండ అశోక్, జక్కుల మల్లేష్ పాల్గొన్నారు. ఆలేరు మండల కేంద్రంలో సీపీఎం అగ్రనేత హరికిషన్‌సింగ్‌సూర్జిత్‌కు, కాచం కృష్ణమూర్తి ఘన నివాళులర్పించారు. రామన్నపేట, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, వలిగొండ, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి మండల కేంద్రాల్లో కాచం కృష్ణమూర్తి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.



రామన్నపేట: కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో స్వరాజ్యం

భువనగిరి టౌన్, ఆగస్టు 1: తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సీడీపీవో ఆర్.స్వరాజ్యం అన్నారు. భువనగిరి జంఖాన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవంలో ఆమె మాట్లాడారు. శిశువు పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, విధిగా 6 నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని 6వ నెల నుంచి అనుబంధ పోషకాహారం అందించాలని తల్లులకు, గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సమత, రాధిక పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్ వై.అరుణ, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్త పారిజాత, ఆయా విమల పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపీవో చంద్రకళ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక జంగాల కాలనీలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ పెద్ద లక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు అనురాధ, పద్మ, శారద, సావిత్రి, పుష్పలత, సౌమ్య, ఏఎన్ఎంలు లక్ష్మీ, నిర్మల ఉన్నారు.

పేదలకు ఎల్లవేళలా అండగా ఉంటా: ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, ఆగస్టు 1: పేద ప్రజలకు అన్నివిధాల అండగా ఉంటానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన బోయపల్లి స్వామి కుమారుడు అనారోగ్యంతో హైదరబాద్‌లోని ప్రసిద్ధి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శించారు. మెరుగైన చికిత్స కోసం రూ.30వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, మారేపల్లి మాల్లారెడ్డి, పూస బాలకిషన్, పున్న జగన్, జినుకల ప్రభాకర్, తిమ్మాపురం మహేందర్ రెడ్డి, గుత్తా నర్సిరెడ్డి, ఎర్ర శేఖర్ గౌడ్, కూనూరు సాయికుమార్ పాల్గొన్నారు.

ప్రతీపోరాటంలో ప్రజా నాట్యమండలి భాగస్వామ్యం

భువనగిరి టౌన్, ఆగస్టు 1: ప్రతీపోరాటంలో భాగస్వాములను ఘనత ప్రజా నాట్యమండలిదని రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్ అన్నారు. గురువారం భువనగిరిలో జరిగిన మండలి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో రవీంద్రభారతిలో ఈనెల 7వ తేదీన రాష్ట్ర స్థాయి ప్రజాకళల పండుగ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి సాంస్కృతిక శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు.

రోడ్డు విస్తరణ పూర్తికాక అభివృద్ధి పనుల్లో జాప్యం: ఈఈ

మోత్కూరు, ఆగస్టు 1: మోత్కూరులో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా మురికి కాల్వల నిర్మాణం చేపట్టడంలో జాప్యం జరుగుతోందని పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మోత్కూరు మెయిన్‌రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు.

తాళ్లగూడెంలో అస్థిపంజరం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 1: మండలంలోని తాళ్లగూడెం గ్రామపరిధిలో హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి పక్కన గురువారం స్థానిక పోలీసులకు అస్థిపంజరం లభించింది. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకరారం... అస్తిపంరంపై జంధ్యం, మొలతాడు, నెక్కరు ఆనవాళ్లు ఉన్నాయి. సుమారు 60 సంవత్సరాల వయస్సున మగ మనిషికి సంబంధించిన అస్థి పంజరం అయి ఉండొచ్చని పోలీసులు తెలిపారు. కారోబార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

చౌటుప్పల్ రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని నేలపట్లలో పార్టీ మండల సమావేశం జరిగింది. ఈ

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాలను జిల్లా మేనేజర్ సాయికుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని సూచించారు.

ఆలేరు రూరల్: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని మందనపల్లి, సాయిగూడెం, ఆలేరులో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, ప్రభుత్వ పరంగా న్యాయం చేస్తామని చెప్పారు.

మోత్కూరు : నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింత గణేష్ కోరారు. మోత్కూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ------------

మోత్కూరు : మోత్కూరు పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాల్లో పెద్ద హాస్పటల్ లేక జబ్బున పడిన పేదవారు చికిత్స కోసం సుమారు 50, 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట, జనగాం జిల్లా కేంద్రాల ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్నదన్నారు. పోస్టుమార్టమ్ సౌకర్యం లేక పలు సందర్భాల్లో రామన్నపేట ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టమ్ చేయించుకు రావడం వ్యయ, ప్రయాస అవుతోందన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని అన్నపూర్ణేశ్వరి ఆశ్రమంలో వాస్తు, జ్యోతిష్య సిద్ధాంతి మాదగాని బుచ్చయ్య రచించిన జాతకుని జన్మ కాల లగ్న గణిత విద్యాబోధన పుస్తకాన్ని క్షేత్రాధిపతి శంకరానంద స్వామి గురువారం ఆవిష్కరించారు.

చౌటుప్పల్ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్ పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద సమస్యల సాధనకు ధర్నా చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ దీపా జోషి తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బుధవారం వీది వ్యాపారులు, మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇందిరా మహిళా శక్తి పథకం పై అవగాహన కల్పించారు.

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు నియోజకవరంతో పాటుగా యాదగిరిగుట్టను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు బందారపు భిక్షపతి, గుండ్లపల్లి భరత్‌గౌడ్, హెరుకల హేమేందర్‌గౌడ్ హెచ్చరించారు. గుట్టలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.

వలిగొండ: మాక్ అసెంబ్లీ ఎన్నికలతో విద్యార్థులకు సాధారణ ఎన్నికలపై అవగాహన ఏర్పాటవుతుందని గాయత్రి పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. పాఠశాలలో నమూనా శాసనసభ ఎన్నికలను నిర్వహించారు. పాఠశాల యాజమాన్యకమిటీ సభ్యులు పడమటి మురళీధర్‌రెడ్డి, కొంతం బిక్షపతి, పాలకూర్ల వెంకటేశం, బిమిడి కవిత పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన దాసరి యాదగిరి మృతి చెందాడు. 1988-1989 పదోతరగతి బాల్య మిత్రులు ఆయన కుటుంబసభ్యులకు రూ.27500సాయంగా అందజేశారు.

రాజాపేట: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ అమలు చేయాలని బీజేపీ రాజాపేట మండల అధ్యక్షుడు దాచెపల్లి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాపేటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీని ఇవ్వాలని రేషన్ కార్డులను అందజేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నర్సింగ్‌రావు, లక్ష్మణ్, కృష్ణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజాపేట: గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరు రాజయ్య కోరారు. గురువారం రాజాపేట మండలం నెమిల గ్రామంలో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. అర్హులైన రైతులందరికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని కోరారు.

కోర్టు తీర్పుతో మాదిగ ఉపకులాల అభివృద్ధికి బాటలు



ఆత్మకూరు(ఎం)లో మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడం ద్వారా మాదిగ ఉపకులాల అభివృద్ధికి బాటలు వేసిందని ఎమ్మార్పీఎస్ సహా పలు రాజకీయ, సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భువనగిరిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి బాణ సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మెన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, నాగారం అంజయ్య, బట్టు రాంచంద్రయ్య, బిక్షపతి, కోటేశ్, నరేశ్, మాటూరి అంజనేయులు పాల్గొన్నారు.

● తుర్కపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గిరి, నాయకులు మోత్కుపల్లి రఘు, పల్లెపాటి చంద్రహాస్, కోట బిక్షపతి, ఎర్రోల్ల రాములు, సిలివేరు దుర్గయ్య, ఎం. శంకర్, తలారి మాతయ్య, జేరిపోతుల అమరేందర్, జేరిపోతు బిక్షపతి పాల్గొన్నారు.

● మోటకొండూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాయకులు బొట్ల యాదయ్య, వంగపల్లి మహేందర్, బొట్ల నర్సంహ, వంగపల్లి ఉప్పలయ్య, నల్ల జహంగీర్, బొట్ల శ్రీనివాస్ బీసీ నాయకులు భాస్కరుని రఘునాథరాజు, ఎగ్గిడి కృష్ణ, అనంతుల నవీన్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, బుగ్గ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● ఆలేరు మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కందుల శంకర్ నాయకులు తాటికాయల నరేందర్, అయిలయ్య, కౌన్సిలర్ కందుల శ్రీకాంత్, రాంనర్సయ్య ఉన్నారు.

● భూదాన్‌పోచంపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాముకుంట్ల బసవయ్య, ప్రధాన కార్యదర్శి కంజర్ల గణేష్, పట్టణ అధ్యక్షుడు పెద్దల శ్రీను, మున్సిపల్ కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, నాయకులు యాకరి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

● రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభాకర్, సమ్మయ్య, శ్రీను, ప్రకాష్ పాల్గొన్నారు.

● బీబీనగర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మద్దూరి నర్సింగ రావు, మాజీ జడ్పీటీసీ సందిగారి బస్వయ్య, నాయకులు దేవరకొండ సంజీవరావు, సోమారపు శారద చంద్రయ్య, శంకర్, అమరేందర్, జంగయ్య, దేవదాసు, నవీన్‌కుమార్, బస్వయ్య, పాండు, అశోక్, శ్రీనివాస్, బాలరాజు పాల్గొన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు నల్ల చంద్రస్వామి, జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేష్, కుమ్మరికుంట్ల గణేష్, మేడి శ్రీనివాస్, వస్తుపుల స్వామి, ఎం.లింగస్వామి, నల్ల బాలరాజు, మందుల ఇసాక్, సుంచ్ శ్రీను, పాల్గొన్నారు.

●యాదగిరిగుట్టలో నాయకులు మంద శంకర్‌మాదిగ, బూడిద సురేందర్, బూడిద జాని, సుంచు ప్రేమ్, లక్ష్మి, మహేందర్ ఉన్నారు.



చౌటుప్పల్‌లో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు